# అదృష్టహీనుడు

**బీనాదేవి**

"పాపం" కామేశానికింటి పేర్లాంటిది. "పాపం కామేశం" అంటారంతా. కామేశం గురించి ఏం మాట్లాడాల్సొచ్చినా.

పాపం చేసే పుట్టేనని కామేశం నమ్మకం.

ఈ జన్మలో మరింక ఏ పాపం చెయ్యకూడదని అతని ఆదర్శం.

కామేశం అంటే చాలామందికి అభిమానం. అమాయకుడని. ఎంతమంది అభిమానించినా సుఖపళ్లేని జీవి అతను. అతను మనస్ఫూర్తిగా నవ్వి ముప్ఫయి ఏళ్ళయింది. అతనివయస్సిప్పుడు ముప్పైఒకటి.

బట్ట తలపాగాతో, బూజుపట్టినట్టున్న గడ్డంతో, చిరిగిన లాంగ్‌కోటుతో, పొగచూరిన గోడకు వేలాడుతున్న ఫొటోలో రెండోవరసలో నిల్చున్నవాళ్ళలో మూడో మనిషిగా మాత్రం కామేశానికి తన తండ్రని తెలుసు. "నాన్నుంటే ఎలా వుండునో" అని కామేశం చాలాసార్లాలోచించేడు. "అమ్మకి జుట్టుండును" అని తప్పిస్తే, తనతండ్రి జీవించివుంటే కలిగే యితర మార్పులేవీ కామేశానికి తట్టలేదు.

కామేశంచిన్నప్పుడే చెప్పేశాడు అచారి మేష్టరు "వీడికీజన్మలో ఒక్క మేథమెటిక్సూ రాదు." అని. కామేశానికి లెక్కల్తోపాటు చాలా రాలేదు. అతనికి బాగా వచ్చేది హిస్టరీ. ఓ మోస్తరుగా వచ్చేది హిందీ. బళ్లో అతన్ని చీవాట్లుపెట్టని మేష్టరు లేడు. ఆఖరికి డ్రాయింగు మేష్టరుకూడా కొట్టాడతన్ని ఓనాడు.

రెండంచీల మీద లేదనిపించాడు స్కూలు ఫైనలు తన యిరవైయ్యొకటో ఏట. పైకి చదివించడాని కతని తల్లికి శక్తిలేకపోయింది. అతన్ని పెంచి పెద్దచేసిం దతని తల్లి కామాక్షమ్మ. అతను పూర్తిగా పెరక్కుండానే తన ఆడబడుచు కూతుర్నిచ్చి పెళ్ళిచేసిం దతనికి. అతని విధవప్పగారు రంగమ్మ. రంగమ్మ కామేశంకంటె పెద్ద. చాలా పెద్ద. ఆవిడ మొగుడ్ని కామేశం ఎరగడు.

కొత్త బట్టల కోసం పల్లకీ ఎక్కాడు కామేశం, స్కూలుఫైనలు పాసవగానే. కొత్తబట్టల్తో కాపురానికొచ్చిన కామేశ్వరిని చూసి చాలా సంతోషించాడు. ఆనందం అతని హృదయంలో చిందులు తొక్కింది కొన్నాళ్ళు. ఆతర్వాత కామేశ్వరి చిందులు తొక్కడం ప్రారంభించింది.

తన కాపురం గురించి అతని కేవో లీలగా తీయని ఊహలుండేవి. ఆ ఊహలకీ, తన కాపురానికీ ఏవీ సంబంధం లేదని కామేశానికి వేగంగానే తెలిసిపోయింది. తొలిరోజుల్లో తన సాన్నిధ్యానికి సిగ్గుతో ముచ్చటపడే అతని భార్య తర్వాత్తర్వాత ముచ్చటపడ్డం మానేసింది; ఆతర్వాత అతనంటే సిగ్గుపడ్డంకూడా మానేసింది.

కామేశానికీ, అతని భార్యకీ పేర్లు తప్ప యింకేవీ కలువలేదు. వాళ్ళ ఆశలూ, ఆశయాలూ, అభిమతాలూ, అభిప్రాయాలూ అన్నీ వ్యతిరేకమే. చల్లనివెన్నెల కొబ్బరి చెట్లను తడుపుతూంటే, వెన్నెలకు తడిసి మెరిసే కొబ్బరాకుల్ని తనూ తన భర్తా చేయీ చేయీ పట్టుకొని డాబామీద కూర్చుని చూడాలని కామేశ్వరి అభిలాష. చంద్రుడుండగా గాని, సూర్యుడుండగా గాని తన భార్యచెయ్యి తాను పట్టుకున్న పాపాన పోలేదు కాని, చంద్రుడూ సూర్యుడూ బెడ్ లైటూ లేనప్పుడు తన చెయ్యిమాత్రం తన భార్యని పట్టుకోనిచ్చేవాడు కామేశం. సాయంత్రం చల్లగాల్లో తనూ, తన భర్తా ఏ కాలవొడ్డునో, సముద్రపొడ్డునో మనుషులకి దూరంగా, దేవతలకి దగ్గరగా చెట్టాపట్టా లేసుకొని తిరగాలని కామేశ్వరి కోరిక. శివాలయానికీ, ఆస్పత్రికీ తప్ప భార్యాభర్తలు కలిసి యింకెక్కడికీ వెళ్ళకూడదని కామేశం అభిప్రాయం.

కామేశం గదిలో వుండగానే తాను జాకెట్టు మార్చుకొంటున్నప్పుడు కామేశం కొంటెగా తనవేపు చూస్తే "ఏవిటండీ ఆ చూపు" అని విలాసంగా కామేశం మొహాన్ని ఎడంచేత్తో వెనక్కి తోసి, తాను కుడివేపు ఎర్రగా సిగ్గుతో వాలిపోవాలని కామేశ్వరి కాంక్ష. అంచేత కామేశం గదిలో వున్నప్పుడు చాలాసార్లు జాకెట్టు మార్చుకుంది. మార్చుకోవాల్సిన అవసరం లేకపోయినా, ఆ సమయాల్లో ద్వారం దగ్గరగా వుండి తెరిచివుంటే కామేశం బైటికి గెంతేసేవాడు; లేదా ద్వారం కామేశ్వరికి దగ్గరుండి మూసివుంటే, బుద్ధిగా రెండోవేపు తిరిగిపోయేవాడు.

ఆ రోజు మంగళవారం. కామేశం అమ్మా, అక్కా గుడికెళ్ళేరు. కామేశ్వరీ, కామేశం ఒంటరిగా యింట్లో వున్నారు. అలా వుండటం అదే ప్రథమం. కామేశ్వరి ఊహలకి రెక్కలొచ్చేయి. ఏదో అర్థం కాని వింత ఆనందం ఆమెని వశం చేసుకుంది. ఆశ గాలికి తెరచాపలా పొంగింది. వీధి తలుపేసేసి "తలంటి పోసుకుంటారా?" అంది నవ్వుతూ కామేశంతో. తర్వాత "పోయమంటారా?" అనడుగుదామని. మంగళవారంనాడు అభ్యంగన ఫలం మృత్యువు అని తెలిసిన కామేశం "వద్దు" అనేశాడు.

ఎక్కడో ఒక తీగ తెగింది. విచ్చే మొగ్గది ఒక రేకు రాలిపోయింది.


కామేశం స్నానం అయ్యేక కామేశ్వరి వెళ్ళింది స్నానానికి. చాలా చన్నీళ్ళు తొరుపుతుంది. మూడు పక్కలే గోడలు న్నాయి వాళ్ళ బాత్‌రూముకి. ఆకాశమే పైకప్పు, వేరే ద్వారం పెట్టనక్కర్లేకుండా. దానికి నాలుగో గోడ పెట్టడమే మానేశారు. ఆ గోడలేనివేపు వెళ్తే బాత్‌రూమంతా కని పిస్తుంది. వెళ్ళడానికి యిటికలు పాతిన తోవకూడా వుంది. స్నానం రమారమి అయేవరకూ కామేశ్వరికి మానభంగం కాలేదు. ఆవిడే పిల్చింది: "ఏవండోయ్! ఆరేసిన చీర గదిలో దండేన్నుంది. కాస్త యిలా పడేస్తారా బాబ్బాబూ" అని.

బాబ్బాబు చీర దండెమీదనుండి తీసేడు. "అయినా యీ కామేశ్వరి కింత మందమతితవం పెరిగిపోతోందేవిటి చెప్మా రోజురోజూ" అనుకుంటూ చీరని బాత్‌రూం లోకి ఎలా పంపించడమా అన్న సందేహం రాలే దతనికి. చీరని ఉండలా చుట్టేడు. పెద్ద సైజు బంతిఅంత అయింది. దాన్ని పది లంగా పట్టుకుని బాత్‌రూం గోడదగ్గర కెళ్ళి "పట్టుగో" అని దాన్ని బాత్‌రూంలోకి విసి రేశాడు. ఏ మాత్రం చాకచక్యం వున్నా కామేశ్వరి దాన్ని పట్టుకుంటుందని అతని ఊహ. చీర ఏవైపునుండి ఎలా వస్తుందో తెలుసుకోలేని కామేశ్వరి చీరని పట్టుకోలేక పోయింది. చీర నేలని పడిపోయి బురదంతా పట్టించుకుంది.

చాలా తీగలు పటపట తెగిపోయేయి. ఎక్కడో ఒకమొగ్గ తన రేకులన్నీ రాల్చేసు కుంది. తన చీరతో పాటు ఆశలుకూడా బురదపాలై నట్టనిపించింది కామేశ్వరికి.

* * *

రోజులు నలిగి దొర్లిపోతున్నాయి. కామేశంగారిది చిన్నిల్లయినా యిల్లంతా డాబా. డాబామీదున్న చిన్నగదే కామేశం బెడ్‌రూం. ఆ యింటికి ఒకపక్క విశ్వ నాథం యిల్లు; రెండోపక్క యింట్లో రెవిన్యూ యినస్పెక్టరు నాయుడు. తల్లిలేని, తన యిద్దరు పిల్లల్తోటి కామేశ్వరి కాపరా



నికి రాకపూర్వంనుండి అద్దె కుంటున్నాడు. నలభై ఏళ్ళు దాటుండవు అతనికి. భార్య లేకుండా కేవలం వంటమనిషి సాయంతో తన బిడ్డల్ని పాపం అతను ఎలా పెంచగల్గు తున్నాడా అని కామేశం చాలాసార్లు సాను భూతితో ఆలోచించాడు.

కామేశ్వరి కాపురానికొచ్చిన సంవత్స రానికే నాయుడు మంచివాడు కాడనీ, అతను తనవేపు అదోలా చూస్తాడనీ కామేశంతో రహస్యంగా మొరపెట్టుకుంది. ఎంత వద్దన్నా వినకుండా, నాయుడింటివేపున్న కిటికీ తలుపులు మూయించేసింది. నాయుడు మంచివాడనీ, అతన్ని తను చాలా రోజుల నుండీ చూస్తున్నాననీ కామేశం ఎంత నచ్చ జెప్పినా ఆవిడకి నచ్చలేదు.

ఆ సంవత్సరం ఫిబ్రవర్లోనే ప్రారంభిం చింది కామేశ్వరి ఆరుబయట పడుకుందా మన్న మారాం. చన్నీళ్ళ స్నానంలో నమ్మకమున్నా, కామేశానికి మంచులో పడుకోకూడదని నమ్మకం. మంచులో పడు కుంటే పక్షవాతం వస్తుందని అతని చిన్నప్పు డెవరో అన్నారు. అంచేత అతను మే, జూన్లలో మాత్రం 15 రోజులు బైట పడు కుంటాడు.

కామేశం "బైటపడుకోవద్దు. జలుబు చేస్తుంది'' అని సలహా యిచ్చేడు.

కామేశ్వరి విన్లేదు.

"జబ్బు చేస్తుంది'' నచ్చచెప్పాడు.

"కామేశ్వరికి నచ్చలేదు.

"పక్షవాతం వస్తుంది" భయపెట్టేడు.

భయపడ్లేదు కామేశ్వరి.

"అయితే నీ ఖర్మ. సుబ్బాకత్తెవూ పడుకో," అని శపించాడు.

ఆ శాపాన్ని వరంలా అంగీకరించిం దావిడ. ఉన్న ఒక్కమంచాన్నీ పరుపునీ

విడదీశారు. పరుపు కామేశం వాటా కొచ్చింది. మంచమే చాలనుకుంది కామేశ్వరి.

హాయిగా నేల్ని పరుపు వేసుకొని గదిలో పడుకునేవాడు కామేశం.

చలిగాలి కిందా మీదా కొడుతూ వట్టి మంచంమీదేమిటా హాయి ఆ పిల్లకి" అని విస్తుపొయ్యేవాడు.

ఆ హాయి ఏమిటో ఆమె చెప్పలేదు కాని ఆవిడ కేదో హాయి వున్నట్టే అతని కనుమానం వచ్చింది. "మూడ్రోజుల్లో ముక్కు పట్టేసి గదిలోకి పక్క మార్చదా" అనుకున్నాడు మొదట్లో. కాని ఆమె ముక్కు మూడువారాలైనా మూసుకు పోలేదు సరి కదా, రోజులు జరుగుతున్నకొద్దీ మెరవడం మొదలెట్టింది, మిగతా మొహంతో పాటు. "మంచు యీ పిల్లకి బాగా పడింది" అనుకున్నాడు కామేశం.

మంచు కామేశ్వరికి బాగా పడింది. చల్లగాలికి పొద్దెక్కే వరకూ నిద్ర పట్టేసేది. మనిషికి నడకలో చురుకూ, మొహంలో మెరుపూ, బుగ్గల్లో ఎరుపూ వచ్చేయి నెల తిరక్కుండా. మొహంలో నిండుతనం, మనిషిలో పరిపూర్ణత వచ్చేయి రెణ్ణెళ్ళకే.

భార్యలో వచ్చిన యీ అందమైన మార్పులకి సంతోషించిన కామేశానికి ఆమెలోని యితర మార్పులు నచ్చలేదు. ఆ మార్పుల్లో ముఖ్యమైంది ఆమె చూపులో వచ్చింది. పరధ్యానంగా కళ్ళు కలలు కనే వప్పుడప్పుడు: మరొకప్పుడు చూపుల్లో బెదురు, భయం వ్యక్తమై కనురెప్పలు భయం భయంగా కొట్టుకొనేవి.

ముఖ్యంగా కామేశానికి నచ్చనివి ఆమె తనవేపు చూసే వైఖరి ఆ చూపులో జాలి ఎక్కువగా కనిపించే దతనికి– దెబ్బతిన్న పిల్లిపిల్ల వేపు, గజ్జిపట్టిన బొచ్చుకుక్కపిల్ల వేపు మనుషులు చూసే చూపది. ఇప్పుడు తన కేం తక్కువని అలా జాలిగా చూస్తుం దనుకొనేవాడు.

కాని ఆ చూపు అత న్నెక్కువకాలం బాధపెట్టలేదు. ఆమె అలా చూడ్డం మొదలు పెట్టిన నాల్నెల్లకే పక్కింటి రెవిన్యూ యినస్పెక్టరుకి ట్రాన్సఫరై మరో వూరు వెళ్ళిపోవడం, అతన్తోపాటు కామేశ్వరి కూడా వెళ్ళిపోవడం జరిగేయి.

"అవ్వ! ఎంత సిగ్గుమాలిన పని. తక్కువకులం వాడితోనా" అని నోరు నొక్కుకుంది కామేశం అక్క.

అది విన్న ఎదురింటావిడ సీకుమల్లె అందరికీ స్వకాలవాళ్ళే కుదుర్తారా," అని మనసులో అనుకొని "ఔను, ఎంత సిగ్గుచేటు" అని బైటకు నోరు నొక్కుకుంది "కాపరాని కొచ్చిన మూడేళ్ళకే యింతపనా?" అంది బెంగగా కామేశంతల్లి – కాపరానికి మూడేళ్ళు పూర్తైతే ఏ పన్చేసినా ఫర్వాలేదన్నట్టు.

* * *

ఆఫీసరు గదిలోకి టపా పట్టు కెళ్ళిన వీరయ్య. టపా ఆఫీసరుగారి బల్లమీద పెట్టి తన నడకలో తొందర కన్పించనీకుండా బైట పడ్డాడు. ఆవేళ ఏదో ప్రళయం బద్దలవుతుందని అందరికీ తెలుసు. టపాలో పై అధికారినుండి ఆఫీసరుగారికి వచ్చిన డి. ఓ. ఒకటుంది.

ప్రళయం రాకపోయినా, ప్రళయం వచ్చినంత శబ్దంతో మోగింది ఆఫీసరుగారి గదిలోని కాలింగు బెల్లు. సర్వేశ్వరుణ్ణి తల్చుకుంటూ పైకప్పువేపు చూస్తూ నిలబడిన వీరయ్యకి పైకప్పులో సాలెపురుగు రూపంలో తప్ప సర్వేశ్వరుడు కన్పించలేదు కాని గదిలోని ఆఫీసరు రూపంలో వున్న యముడు గుర్తు కొచ్చేడు. యముడి దగ్గరికి వెళ్ళినట్టే అయిష్టంగా వెళ్ళేడు గదిలోకి, నెత్తినతలపాగా బోర్లించుకుంటూ.

"హెడ్ గుమాస్తాని పంపించు" అన్న ఆఫీసరు అరుపు ఆఫీసంతా వినిపించింది. ఏనుగని లోపలికి పంపనున్న సింహం ఆహ్వానం అది. కాని హెడ్‌గుమస్తా విశ్వనాథాన్ని ఎరిగున్నవాళ్లెవరికీ ఏనుగ జ్ఞాపకం రాదు అతను గుర్తుకొచ్చినప్పుడు. వాళ్ళకి నక్కలాటి చిన్నసైజు తెలివైన జంతువులే గుర్తుకొస్తాయి.

"ఏవిఁటీ వెధవ్వ్యవ్వ త్తరం" అంటూ విశ్వనాథం మొహంమీదకి విసిరికొట్టాడాఫీసరు తన టేబిలుమీదున్న డి. ఒ. తీసి. విశ్వనాథం దాన్ని తీసుకొని చదివి నవ్వేడు, ఏడవలేక.

ఆఫీసరు గొంతు ఆఫీసంతా వినిపించదన్న భయం లేకపోయినా, హెడ్ గుమాస్తాకి వ్యతిరేక శక్తులు రెండు తమ టేబిలు వదిలి ఆఫీసరు గదివేపు నడుస్తూ "వేరీజ్ దట్ ఇనెఫిషెంట్ ఫూల్ కామేశం? (Where is that inefficient fool Kamesam?")అన్న ఆఫీసరు కేకకి అదిరిపడి మళ్ళా తమ టేబిలు వేపు వెళ్ళిపోయేయి.

"అతనికి రాత్రినుండి జ్వరంగా వుంది సార్. వూళ్లో అమ్మవా రుందని నేనే ఆఫీసుకి రావద్దన్నాను. డిస్పాచ్ నెంబరు చూసి చెప్తాను సార్ దీని విషయం" అన్నాడు విశ్వనాథం.

అమ్మవారి వూసెత్తేసరికి ఆఫీసరు నోటికి తాళం పడిపోయింది. యాభయ్యో పడిలో పడినా, అతనికి తన అందంమీద, పర్సనాలిటీమీద చాలా నమ్మక ముంది. అమ్మవా రొస్తే అందం హరించిపోతుందని అతనికి మహాభయం. అమ్మవారి గురించాలోచిస్తూ ఆఫీసరు మాట్లాడకపోవడం చూసి బైటికి జారుకున్నాడు విశ్వనాథం.

* * *

ఆఫీసుకొస్తూ ఆఫీసు సందుమలుపు తిరిగిన కామేశానికి వీరయ్య రొప్పుతూ తనకోసం పరిగెత్తడం ఆశ్చర్యం కలిగించింది. "ఎడ్‌గుమస్తాగోరు తమఁర్ని రెండ్రోజులు జరవఁని శలవెట్టి యింటికాడే కూకోమన్నారు, బైటకి రావద్దన్నారు" అని వీరయ్య చెప్పిన మాటలకి మూర్ఛొచ్చినంత పనైంది.

కామేశం తన తండ్రి తద్దినం నాడు తప్ప యింకెప్పుడు శలవుపెట్టినా హెడ్




గుమస్తా వప్పుకోడు. భగవంతుని లీల అర్ధంకాని కావేశం హెడ్‌గుమాస్తా లీల కూడా అర్ధం చేసుకుందుకు ప్రయత్నించ లేదు. కాని అతని సలహా ప్రకారం ఇంటి కెళ్లిపోయాడు–ఆయాచితంగా వచ్చినశలవు, యిల్లు కదలకుండా ఎలా గడపడమా అని ఆలోచిస్తూ.

*　　*　　*

గుమాస్తాగా జీవితం ఆరంభించిన ఆఫీసరు తన తెలివి తేటలవల్లా, చాక చక్యంవల్లా మీది కెళ్ళి ఆఫీసరయ్యాడు. పనిలో నాన్చుడంటే అతను సహించలేడు. త్వరగా నిర్ణయాలకి రావటం అతని ప్రత్యేకత. ఆ నిర్ణయాలు చాలా భాగం రైటవడం భగవదనుగ్రహం. దూరాభారాన ఎమ్. బి. బి. యస్. చదువుతున్న పెద్ద కొడుక్కి, త్వరలో పెళ్ళి చేసి పెద్దకట్నం పుచ్చుకుందామని అతని ఆశ. ఆ ఆశ ఫలించేటట్టు ప్రయత్నాలు చేశాడు. అందులో ఒక ప్రయత్నంలో పాతికవేలు చూచాయగా కప్పించాయి. ఆ సంబంధం ఖాయం చేసుఖుందామనుకొని, కొడుక్కి ముందుగా చెప్పడం మంచిదని అతనికి ఉత్తరం రాశాడు.

కొడుక్కి–కూడా తండ్రిపోల్కె–త్వరగా నిర్ణయాలకి రావడంలో. తన వివాహం విషయమై తనకి స్వంత అభిప్రాయా లున్నట్టు అతను జవాబు రాశాడు.

ఆఫీసులోనే అందింది ఆఫీసరుగారికి కొడుకు జవాబు. జవాబుకి జవాబు వెంటనే కాయితం తీసి రాశేశాడాయన.

మైడియర్ సత్యనారాయణా,

ఇటుపైని యిలాంటి వెధవుత్తరాలు రాయొద్దు. నాపట్ల నువ్వు చూపవలసిన గౌరవం చూపలేకపోతే, యీ నెలనుండీ కానీకూడా నానుండి ఆశించవద్దు.

యువర్స్ సిన్సియర్లీ

అని సంతకం చేసి, ఆఫీసు కాయితాల మీద తన సంతకాలకై వచ్చిన కావేశానికి

ఆ ఉత్తరం, కొడుకు ఎడ్రసు ఇచ్చి పోస్టు చెయ్యమన్నాడు.

అదే టపాలో పై అధికారికి ఏదో స్టేట్‌మెంటు పంపాలి. అది ఆలశ్యమైందని అధికారి అంతకు ముందురోజే ధుమధుమలాడుతూ ఉత్తరం రాశాడు.

కామేశం తన విధి తప్పకుండా స్టేట్‌మెంటూ, ఆఫీసరుగారి కొడుకుగారి ఉత్తరం డిస్పాచ్ చేశాడు. కాని ఆ డిస్పాచ్ చెయ్యడంలో ఒక కవర్లో పెట్టవలసిన ఉత్తరం మరో కవర్లో పెట్టాడు. అతని సాధారణమైన పొరపాటు, అసాధారణమైన పరిణామాలకు దారి తీసింది. పై అధికారి పేరూ సత్యనారాయణే అవడంవల్ల — అతను నిప్పులాంటి మనిషి. లంచం అంటే రోత. ఆఫీసరు కొడుక్కి రాసిన ఉత్తరం చదువుకున్నాడు. తన కళ్ళని తానే నమ్మలేక మళ్ళీ చదివాడు. "ఏమిటి వీడి ఉద్దేశం! నెల్నెలా నాకు డబ్బు పంపిస్తున్నాడా వీడు. వీడి పట్ల నేను చూపించాల్సిన గౌరవం చూపించకపోతే వీడు డబ్బు పంపడం మానేస్తాడా?" అనుకున్నాడు. అనుకున్నాక ఆలస్యం చెయ్యకుండా ఆ ఆలోచనల్నే కాగితంమీద పెట్టి డి.ఒ. కింద పంపించేశాడు క్రింద అఫీసర్‌కి. ఆ డి.ఒ. మూలంగానే అక్కర్లేని శలవనుభవిస్తున్నాడు కామేశం.

ఆ సాయంత్రం టపాలో ఆఫీసరుగారికి తన కొడుకు దగ్గర్నుంచి ఒక ఉత్తరం వచ్చింది. అందులో ఆఫీసు స్టేట్‌మెంటుంది. దాంతో ఆఫీసరుగారికి డి.ఒ. అర్థం అయిపోయింది. వెంటనే హెడ్‌గుమాస్తాను పిల్చి కామేశాన్ని డిస్మిస్ చేసేయమన్నాడు. దాని కేం భాగ్యం. శలవునుండి రానీండి, అలాగే చేసేద్దాం" అని హెడ్ గుమాస్తా తాత్కాలికంగా చక్రం అడ్డువేశాడు.

* * *

హెడ్ గుమస్తా విశ్వనాథ్ది కామేశం యింటి పక్కల్లు. భార్య లేకుండా గడుపుకోలేని వయసులో, రెండో పెళ్ళికి తయారవలేని వయసులో అతనికి భార్యావియోగం కలిగింది. అప్పటికి అతనికి 14 ఏళ్ళ పెద్ద కూతురుకాక, మరోముగ్గురు సత్తా నావా వున్నారు. ప్రపంచం గుట్టెరిగిన జ్ఞాని అతను. అభానికీ, శుభానికీ కామేశం తల్లి చేత వంటచేయించుకుంటూ, కామేశం కుటుంబంవల్ల తనకు వీలైన అవసరాలు గడుపుకుంటూ, వాళ్ళకు కూడా తను యథాశక్తి సాయపడుతూ వుండేవాడు. అతనికీ, కామేశం అక్కకీ ఏదో వుందని ప్రపంచం వేసిన నిందలో నిజానిజాలు ఎలా వున్నా, కామేశానికి తన ఆఫీసులో టెంపరరీ గుమాస్తాగా వేయించింది అతనే.

కామేశం మూడుసార్లు సర్వీసు కమీషనుకి కట్టినా లాభం లేకపోయింది. సర్వీసు కమీషనుకితప్ప. యిప్పటి కారేళ్ళ క్రిందట, కానీ ముట్టని, ఎవరికీ అక్కర్లేని రిసీవ్ అండ్ డిస్పాచ్ సెక్షన్లో ప్రవేశించాడు కామేశం. అందులో ప్రవేశించిన వాళ్ళంతా ఆర్నెల్లు దాటకుండా యితర సీట్లల్లోకి దాటేస్తారు. ఆరేళ్ళయినా కామేశం దాన్ని వదలకపోవడానికి కారణాలు రెండు— ఆ ఆఫీసులో అంతకన్న తక్కువసీటు లేకపోవడం మొదటిది. విశ్వనాథం, కామేశం డిస్మిస్ కాకుండా కాపాడుతూ వుండడం రెండోది.

ఆఫీసులోనిమిగతా గుమాస్తాలూజవాన్లూ మొదట్లో మామూలుగానే గౌరవించారు కామేశాన్ని. కాని కొద్ది నెలల్లోనే అతను ఆఫీసుకి వస్తూంటే జవాన్లు నిలబడ్డం మానేశారు. మొదట్లో అతన్ని చూసి ఆదుర్దాగా కాలుస్తున్నబీడీ పారేసే జవాన్లు, తర్వాత్తర్వాత బీడీ పారేయకుండా చేతిలో మూసి వెనక్కిపెట్టడం, ఆ తర్వాత అది కూడా మానేడం జరిగింది. కాని దానికి ఎంత మాత్రం విచారించలేదు కామేశం.

అతనికి జవాన్లంటేనే చికాకు. ఏపనీ చేతకానివాడిని భగవంతుడు జవానుగా పుట్టిస్తాడని అతన్నమ్మకం. అసలు వాళ్ళకి కవర్లుకూడా సమంగా అంటించడం రాదు. ఇన్నికవర్లూ, మరోయిన్ని సర్వీసుపోస్టేజి స్టాంపులు. ఏ కవరుమీద ఎన్ని స్టాంపులు అంటించాలో మూడుసార్లు చెప్పి యిచ్చినా ఒక్క జవానూ సరిగా అంటించడు. అంచేత తానుద్యోగంలో ప్రవేశించిన కొద్ది రోజులకే జవాన్లచేత ఆ పని చేయించడం మానేశాడు కామేశం. అతనే మూతి విరిగిన సిరాబుడ్డిలోవున్న తుమ్మబంక తడుపుకొని సిరస్తాగా కవర్లు అంటించి, వాటికి కుడివైపు మీదిభాగంలో కావలసినన్ని స్టాంపులు వరసగా ఒకదానిపక్కనొకటి అంటించుకుంటే, జీవితంలో ఏదో గొప్ప ఘనకార్యం సాధించినట్టుండేది. అదే జవాన్లచేత చేయిస్తే వాళ్ళు కొన్ని స్టాంపులు సమంగానూ, మరికొన్ని తలకిందులుగానూ అంటించేవారు. ఛీ! ఛీ!! అసహ్యం. కవరూ, ఎడ్రసూ, స్టాంపులూ చూడగానే చిరునామాదారు ఆకర్షింపబడాలి. తాను డిస్పాచ్ చేసిన ఉత్తరం బొచ్చెడు ఉత్తరాల్లో చిరునామాదారుని ఆకర్షించాలనేది కామేశం ఆశయాల్లో ఒకటి. ఆ పెద్దమనిషి — అతనూ ఉద్యోగే — తనకు వచ్చిన ఉత్తరాల్ని ఒకసారి విప్పకుండానే చూసి కామేశం డిస్పాచ్ చేసిన ఉత్తరాన్నే "ఎంత నీట్‌గా వుందో అనుకుంటూ — అసలు కామేశాన్ది ముత్యాలకోనలాటి దస్తూరీ — మొట్టమొదట విప్పి చదువుకోవాల్ని కామేశం ఆశ.


ఆ ఆశయం ఫలించిందో లేదో తెలీదు కాని, అతని మరో ఆశయం మాత్రం ఫలించింది. జవాన్లమీద అతను ఆధారపడిన న్నాళ్ళు సగటున నెలకి కామేశం ఆఫీసు నుండి వుత్తరాలు వెళ్ళిన యితర ఆఫీసులు కవర్లమీద తక్కువ పోస్టేజి అంటించడం వల్ల తాము పెనాల్టీ రెండింతలు కట్టుకున్నామని రాయడం, ఆ పెనాల్టీ డబ్బులు గవర్నమెంటువారు కామేశం దగ్గర్నుంచే వసూలు చేయడం జరిగేది. డబ్బులు పోతున్నాయని కామేశం విచారించలేదు కాని యింత చేతకాని జవాన్లు సంసారాలు ఎలా నడుపుకుంటారా అని బాధపడేవాడు. కవర్లు తానే అంటిం

చదం ప్రారంభించేక సగటున నెలకి ఒక్క సారి మాత్రం పెనాల్టీ కట్టుకోవలసి వచ్చేది కావేశానికి. యీ అభివృద్ధికి ఆఫీసరుగాని, కనీసం హెడ్ గుమాస్తాకాని తనని అభినందించాలన్న కావేశం వాంఛ అతని తీరని కోరికల్లో ఒకటి.

అతని అఫీసుకి చాలినన్ని కవర్లు సప్లై అయేవికావు. అందువల్ల తీరిక సమయం అంటూ వుంటే, ఆ సమయంలో కావేశం తన ఆఫీసుకి వచ్చిన పెద్దకవర్లన్నీ చించి, వాటి లోపలి భాగం పైకి వచ్చేలా మడత పెట్టి, చిన్నకవర్లుకట్టి అవి వాడేవాడు. అవి చూడ్డానికి కొత్తకవర్లలా ముద్దొస్తూ వుండేవి. అసలు యింతకు ముందు ఆఫీసరు తన ఫేర్‌వెల్ పార్టీలో గుమస్తా లందరివద్దా శలవు తీసుకుంటు న్నప్పుడు కావేశం దగ్గరికి వచ్చి నవ్వుతూ "కవర్లు కట్టడంలో మన కావేశం ఫస్టు." అని బహిరంగంగానే అభినందించడం, కావేశం ఆరోజు రోడ్డుమీద కాకుండా గాల్లో నడచి యిల్లు చేరడం జరిగాయి.

కావేశం ఆశయా ల్లేనివా డనడానికి వీల్లేదు. అతని ముఖ్య లక్ష్యం లంచం పుచ్చుకోకూడదని. అది ఫలించడానికి ప్రపంచం అంతా అతనికి సహాయం చేసింది. అతనికి ఎటువంటి లంచం ఎవరూ యిస్తామన్లేదు ఒక్కనాడు తప్ప.

ఒకనాటి రాత్రి కావేశం భోజనానికి కూర్చోబోతూవుంటే ఎవరో వీధి తలుపు తట్టేరు. పట్టుపంచతోవున్నా కావేశమే స్వయంగా తలుపుతెరచి ఆ వచ్చిన సిల్కు బట్టల, బట్టతల పెద్దమనిషిని గదిలోవున్న ఒక్క కుర్చీలోనూ కూర్చోమని తాను నిలబడ్డాడు. అతని బట్టతలతో నిండైన ఎర్రటి విగ్రహం, నెరిసీ నెరవని సన్నని మీసం, కళ్ళద్దాల వెనక మెరిసే కళ్ళూ చూస్తే కావేశానికి అత న్నెక్కడో చూసి నట్టనిపించింది. ఆ వచ్చిన ఆసామీకూడా నీళ్ళు నమలకుండా చిరునవ్వుతో "తమరు నిలబడుంటే నేను కూర్చోడమా! ఎంతమా




టెంతమాటా! తమరు కూర్చోండి" అంటూ భుజాలు పట్టుకుని కావేశాన్ని కుర్చీలో కూర్చోపెట్టేసి తానే నిలబడ్డాడు. "ఎంత మర్యా దెంతమర్యాదా?" అని ఆశ్చర్య పడ్డాడు కావేశం.

"తమరు నన్ను రక్షిస్తానని అభయం ఇవ్వాలి. లేకపోతే నేను మిమ్మల్ని వదల్ను" అన్నా డా పెద్దమనిషి కావేశాన్ని పట్టుకోకుండానే.

"చెప్పం డేం కావాలి?" అన్నాడు కావేశం. నిజాని కతను ఏం కావాలన్నా ఇచ్చెయ్యాలనుం దతని మర్యాద చూశాక.

"అంతపెద్ద పనేం కాదు. ఈవేళ మీ ఆఫీసులో సంతకం అయిన బిల్డింగు కంప్లీషను రిపోర్టు త్వరగా డిస్పాచ్ అయ్యేట్లు చూడాలి అంతే. అది వెళ్తేగాని నాకు రావలసిన డబ్బు నాకు రాదు. తమరా రిపోర్టు రేపు డిస్పాచి చేస్తిరా తమ మేలు జన్మలో మర్చిపోను" అన్నా డా పెద్దమనిషి నమస్కరిస్తూ.

అతని కోరిక చిన్నది. న్యాయసమ్మతమైనది. దాన్ని అనుగ్రహించడంలో కావేశం వింత ఆనందం పొందాడు. "తప్పకుండా" అన్నాడు బైటికి.

"థెంక్యూసర్. థెంక్యూ వెరీ మచ్" అంటూ జేబులోంచి పదిరూపాయలనోటు తీసి, కావేశం వద్దనేలోగానే అతని చేతిలో పెట్టి "ఏదో యధాశక్తి" అని ఆకర్షణీయంగా నవ్వే డా పెద్దమనిషి. అతని నవ్వులోని ఆకర్షణ చూసే పరిస్థితిలో లేడు కావేశం. అతనిచూపు ఒక్కసారి తగ్గిపోయింది. వూపిరి బిగుసుకుపోయింది. వళ్ళు అకస్మాత్తుగా వేడెక్కిపోయింది. కిటికీ అవతల చీకట్లో పోలీసులూ, యమభటులూ ఒకర్నొకరు తోసేసుకుంటూ గదిలోకి ఆత్రంగా చూస్తున్నట్టనిపించిం దతనికి. వంట్లో శక్తంతా ఒక్కసారి ఉడికిపోయింది. అకస్మాత్తుగా జరుగుతున్న వర్తమానం గురించి ఆలోచించడం మానేసిన అతని మనసుకి భవిష్యత్తు అగాధమైన సమస్య తెచ్చిపెట్టింది. ఈ బట్టతలమనిషి బైటకు వెళ్ళగానే లోపలికి ఎవరొస్తారా, పక్కింటి హెడ్‌గుమస్తావా? పోలీసులా! ఆఫీసరా? అని ఆలోచించలేక మానేసి "అక్కర్లేదు" అంటూ నోటువున్న కుడిచెయ్యి ముందుకు చాస్తూ నిలబడబోయాడు కావేశం, కాళ్ళు అతని భారాన్ని మోసేట్టులేవు "మరేం తప్పులేదు బాబూ వుంచు చిన్నవాడివి. అంతా చేసేదేం నే వెళ్తొస్తా. నా మాట మర్చిపోకు నాయనా" అంటూ కావేశాన్ని కుర్చీలో కూర్చోపెట్టేసి, బైటకు జారుకున్నా డా పెద్దమనిషి, కావేశం నోరు తెరిచేలోగానే,

తెరిచివున్న తలుపువైపే హెడ్ గుమాస్తా, ఆఫీసరూ. పోలీసులు ఉమ్మడి రాకకోసం చూస్తూ కుర్చీలోనే కూర్చుండి పోయాడు కామేశం. అతనికున్న ఫీలింగల్లా భయం. ఆనందం. విచారం వగైరా. ఫీలింగులు ఎప్పుడో అరుదుగా వచ్చేవి. చిన్నప్పట్నించీ తోటి మగపిల్లలంటే భయం. కొంచెం వయసొచ్చేక మొగపిల్లలన్నా ఆడపిల్లలన్నా ఒక్కలాటి భయమే. బడికి ఆలస్యంగా వెళ్ళడానికి భయం; పాఠాలు చదవకపోతే భయం. అవి రావని; చదివితే భయం. అవి రావడంలేదని; బళ్లో వున్నన్నాళ్ళూ పరీక్ష పోతుందనే భయం; పాసయితే యింకా పెద్ద క్లాసూ. పెద్ద పుస్తకాలూ చదవాలన్న భయం; స్కూలు ఫైనలు పాసయేక ఉద్యోగం దొరకదేమోనని భయం; దొరికేక అది ఊడుతుందేమోనని భయం.

ఈ భయాలకి తోడు యిప్పుడో కొత్త భయం. అలా కుర్చీలో ఎంతసేపు కూర్చున్నాడో తెలీదుకాని వడ్డించేశాన్రా కామూడూ' అన్న తల్లి కేకకి తెలివొచ్చిందతనికి. పరధ్యానంగా రెండుమెతుకులు ఎంగిలిపడి విశ్వనాథంయింటికి పట్టుపంచెతోటే పరిగెట్టికెళ్ళి, జరిగిందంతా అతన్తో చెప్పి యీ విపత్తునుంచెలాగైనా కాపాడమని. అతని చేతిలో బట్టతల పెద్దమనిషిచ్చిన నోటు పెట్టాడు కామేశం. విశ్వనాథం ఆప్యాయంగా "యిలాంటి వెధవ పన్లూసుకెప్పుడూ వెళ్ళకు నాయనా ఎప్పటికైనా నాఅంతై నువ్వు హెడ్‌గుమాస్తా కావాలని నా కోరిక. యీ పదిరూపాయలూ పాప పరిహారార్థం ఏ దేవాలయానికో యిచ్చేస్తాన్లే. నువ్వు బెంగెట్టుకోకు" అంటూ భుజంమీద చెయ్యివేసి రోడ్డు వరకూ కామేశాన్ని దిగబెట్టాడు.

ఆ ఆపదనుండి అంత సుళువుగా బైటపడినందుకు కామేశానికి ఆ రాత్రి వేగమే నిద్ర పట్టేసింది

కామేశానికి లంచం పుచ్చుకోకూడదని ఆశయమైతే. పాపులర్‌గా వుండాలని ఆశ. అతన్ని చూసి అంతా "మన కామేశం వచ్చాడు" అంటే "మన కామేశం వచ్చాడు" అని అనాలని. ఆపదలో వున్న వాళ్ళు "కామేశం వొచ్చాడింకభయంలేదని" అనాలని అతని అభిలాష. ఏదో తప్పుచేసి యినస్పెక్షన్లో దొరికిపోయిన హెడ్‌గుమాస్తా "బాబ్బాబు! యీ గండంనుంచెలాగైనా తప్పించు" అని అతన్ని బతిమాలాలని కామేశం కోరిక. యీ కోరికలు కోరికలుగానే వుండిపోయాయి.

"కామేశానికి ఆదర్శం ఫలించకపోయినా ఆఫీసులో ఆదర్శప్రాయుడైన పురుషుడు కనిపించాడు జార్జిలో. జార్జిని చూసిన వాళ్ళెవరూ అతను లోయర్ డివిజను గుమాస్తా అనుకోరు. అతన్ని చూస్తే కొత్తగా పెళ్లైన డాక్టరో, ఇంజనీరో అనుకుంటా రెవరైనా. పిత్రీయం ఏమీ లేదతనికి; కాని నల్లగా బలంగా వుండే అతను నిత్యం టెర్లిన్ బట్టల్లో మెరిసిపోతుంటాడు మధ్యగా చీల్చి నున్నగా పైకి దువ్విన నల్లటి జుత్తు. ఆరోగ్యంతో మెరిసే మెరక కళ్ళూ. బలమైన కనుబొమ్మలూ, తిన్నని ముక్కూ అతని ప్రత్యేకాకర్షణలు. ఎంత అపరిచితుడికైనా అతన్ని చూడగానే బలం, యుక్తి అతని సొత్తనిపిస్తుంది.

జార్జి నెవరూ ఆఫీసులో ప్రశ్నలు వేయరు. అతని కెదురు జవాబులు చెప్పరు. అతను ఆఫీసుకి తీరుబడయినప్పుడు వస్తాడు. తీరుబడిలేనప్పుడు వెళ్ళిపోతాడు. అతనిమీ దెప్పుడైనా ఆఫీసరుగ్గానీ. హెడ్‌గుమాస్తాగ్గానీ కోపం వస్తే. ఆ కోపం కామేశం లాంటి వాళ్ళమీద చూపించేసి, అతన్తో నవ్వుతూ మాట్లాడుతారు.

జార్జి వస్తువులేవీ చౌకబారువి కావు. అతని వాచీ స్మగుల్డులో రూ. 300. వాడుకుందుకి పైలట్ పెన్నూ. వాడనందుకి పార్కరు పెన్నూ ఒక జేబులోనూ. ఒక లెగ్ బైటపెట్టిన గాగుల్సు రెండో జేబులోనూ ఎప్పుడూ వుంటాయి. దసరా బుల్లోడ్లా ముస్తాబుచేసిన రేలీ సైకిలు ఉందతనికి. అతనికి రాని విద్య లేదు. స్కూటర్లేకపోయినా స్కూటరెక్కడ మొచ్చతనికి; కారు లేకపోయినా కారు నడపగలడు. మిషన్రీ దొర స్కూటరో, కాంట్రాక్టరు కారో ఎక్కి ఎప్పుడూ తిరుగుతూ వుంటాడతను.

ఎవరినైనా అంత సుళువుగా అంచనా వెయ్యగలడతను. ఆఫీసు కొచ్చే మనుష్యులతడు పలకరించడంలోనే తెలుస్తుందతని అంచనా. కొందర్ని చూసి కేవలం చిరునవ్వు నవ్వుతాడు; మరికొందర్ని తన తలా, వాలుకళ్ళూ విలాసంగా దించి పలకరిస్తాడు. మరి కొందరికి తన సీటు పక్కనే కుర్చీ వేయిస్తాడు. ఇంకొందరికి తన సీటు యిచ్చేసి కాఫీకూడా తెప్పిస్తాడు.

అతను ఆఫీసుకి రావడమే ఒక దుమారంలా వస్తాడు. "ఏం వీరయ్యా. ఏమిటి సమాచారం" అని కునికిపాట్లు పడుతున్న వీరయ్యని పలకరించి, హెడ్‌గుమాస్తాకొక "గుడ్ మార్నింగ్ సర్" పారేసి, "ఏం జానికీ! హౌ యీజ్ లైఫ్" అని జానకిని పలకరించి. "హౌ యీజ్ ఎవిరిబడీ" అని మిగతా అందర్నీ ఒక్కచూపులో చుట్టిపారేసి ఉక్కిరిబిక్కిరి చేసేస్తాడు.

జార్జిలాటివాళ్ళు ఆఫీసుకి చీడపురుగులని హెడ్ గుమాస్తా అవ్యక్త అభిప్రాయం. "యిలాటివాడు ఒకడున్నా చాలు ఆఫీసుకి శోభ;" - ఇదీ అవ్యక్త అభిప్రాయమే. జానకిది. జార్జి ఆఫీసులో వున్నంతసేపూ జానక్కి ఊపిరి సమంగా ఆడదు," కలకాలం కామేశంతో బ్రతికేకంటే జార్జిలా నాల్రోజులు బ్రతికితే చాలు- యిది కామేశం అప్రకటిత అభిప్రాయం.

అక్కర్లేందే శలవు దొరికిన కామేశం భార్యగురించి ఆలోచిస్తూ వుంటే నల్లగా చీకటి అతన్నీ. అతనిగదినీ చుట్టేసింది. గదిలో ఎవరూ లైటు వెలిగించలేదు. కింద వంటగిన్నెలు చప్పుడౌతున్నాయి. దూరంగా సినీమాపాట శ్రావ్యంగా వినిపిస్తోంది.

పాటాగిపోగానే "ఎక్కడ చచ్చాడీ కామేశం" అన్న విశ్వనాథం కేక వినిపించింది కింద నుండి. భయంగా మెట్లు దిగాడు కామేశం.


క్రిందిగదిలో ఎర్రటి హరికెన్ లాంతరు వెలుగులో ఎర్రగా మండిపోతూ పచార్లు చేస్తున్నాడు విశ్వనాథం. కామేశం అక్క నవ్వుతూ ఎదురుగా వున్నా. కామేశం గదిలోకెళ్ళి బొగపట్టిన గోడ నానుకుని నేల్ని చూస్తూ నిలబడ్డాడు.

"ఇహ నావల్లకాదు నాయనా నిన్ను కాపాడ్డం. నీ ఖర్మనుబట్టి నువ్వు పో. నన్ను నిందించకు. ఈ శలవయిపోయాక ఆఫీసరు నిన్ను డిస్మిస్‌చెయ్యడం ఖాయం," అని తకీమని కుర్చీలో కూర్చున్నాడు విశ్వనాథం.

"నేన్చేసిన తప్పేవిటి? నన్నెందుకు డిస్మిస్ చేస్తాడాయన? దేన్నించి నువ్వు నన్ను కాపాడాలి?" అని కామేశం అన్లేదు. తనమీదికి ఏదో గండం దొర్లుకొస్తూనే వుంటుందని అతని గట్టినమ్మకం. తనేదో ఘోరమైన అఘాయిత్యం చేసేవుంటానని అతని భయం. రంగులు మార్చుకోక పోయినా నేల్ని చూస్తూనే వున్నాడతను.

"అయినా ఉత్తరాలు పోస్టుచెయ్యడం రాకపోతే యింకెందుకయ్యా నువ్వు? ముష్టి రెండుత్తరాల్లో ఒకదాన్లో ఒకటి పెట్టి యింత కొంప ముంచుతావనుకోలేదు. నిన్నాఫీసుకి రానియ్యొద్దంటున్నా డాఫీసరు. మంచివాడు కాబట్టి యింటి కొచ్చి తన్నలేదు సంతోషించు" అని కుర్చీలోంచి లేచి మళ్ళా పచారు ప్రారంభించేడు విశ్వనాథం,

కళ్ళల్లో ఊరుతున్న నీటిని కళ్ళతోనే వెనక్కి పీల్చడానికి ప్రయత్నిస్తూ నేల్ని చూస్తూనే వున్నాడు కామేశం. విశ్వనాథం వైపు చూడ్డం మాని కామేశంవైపు చూసిం దతనిఅక్క. కడుపు తరుక్కుపోయిం దావిడకి. ఆవిడే ప్రారంభించింది విశ్వనాథంతో సంభాషణ. ఆవిడే తీసింది ఆఫీసులో జరిగినదాని వివరాలు.




అన్ని వివరాలూ చెప్పాడు విశ్వనాథం, ఆఫీసరు కోపానికి తన వివరాలు కలుపుతూ. అన్నీ చెప్పాక "యిహ యీ వేళ్నుంచి మీఖర్మ మీది, నాఖర్మ నాది" అంటూ తారాజువ్వలా వెళ్ళిపోయాడు.

రాత్రి పదిన్నరైనా నిద్ర రాలేదు కామేశానికి. తన తప్పు ఎంతచిన్నదైనా పెద్దగానే కవిపిస్తుం దతనికి. విశ్వనాథం చెప్పినట్లు తన తప్పుకు ఆఫీసరు తనని తన్నినా తప్పులేదు. తను మొదట్నుంచీ భయపడుతున్న పరిస్థితి రానే వచ్చింది. ఉన్న ఉద్యోగం కాస్తాఊడేక చేసేదేంలేదు. రోజులు వెళ్ళడమే కష్టం. అమ్మ మళ్ళీ ఎవరింట్లోనో వంటకు కుదురుకోవాలి. అక్క నీళ్ళు మొయ్యాలి. వాళ్ళ రెక్కలమీద తనాధార పడాలి. తనకి ఏపనీ చేతకాదు. వ్యాపారం చెయ్యలేడు. దానికి యుక్తి పెట్టుబడీ కావాలి. ప్రైవేట్లు చెప్తానన్నా తనదగ్గర ఎవరూ చెప్పించుకోరు. అతని దృష్టిలో అతడు ఎప్పుడూ హీనంగానే కన్పిస్తాడు. యీనాడు మరీ అసహ్యం వచ్చింది తనమీద తనకి.

పదకొండైంది. నిద్ర రాలేదు. భవిష్యత్తులో నమ్మకం హరించిపోతోంది కర్పూరంలా. రాత్రి అవుతున్నకొద్దీ తన వంటరితనమే తనను బాధిస్తోంది; భయపెడ్తోంది.

మేకును తగిల్చిన చొక్కా, పేంటు తొడుక్కుని కాళ్ళు పీకేదాకా వీధులన్నీ తిరిగాడు. ఆఖరుకు రైల్వే స్టేషనుకి తీసుకెళ్ళా యతని కాళ్ళు.

రైలు స్టేషను చేరేసరికి అర్ధరాత్రై చాలాసే పైపోయింది. మూడుగంటలపాసింజరుకోసం అక్కడా అక్కడా ప్లాటుఫారం మీద శవాల్లా పడుకున్నారు కొంతమంది పాసింజర్లు. ఆ శవాల్ని చూసేసరికి ప్రాణం లేచివచ్చినట్లైంది కామేశానికి. ఇంతసేపూ శ్మశానంలా నిర్జీవంగా వున్న వీధుల్లో తిరగడంవల్లొచ్చిన ఒంటరితనం వదిలేసిం దతన్ని.

ప్లాటుఫారంమీద చివర, చీకట్లో సిమ్మెంట్ బెంచీమీద కూర్చున్నాడు కామేశం. వెల్తుర్లో పక్కబెంచీమీద ఎవరో ఒకతను కూర్చుని పకోడీలు తింటున్నాడు. అతని మీసాలు కృష్ణదేరాయల మీసాల్లా వున్నాయి. రెండు గుడ్సురైళ్ళు కట్టిపడేసిన పాముల్లా ఒకదాని మీదొకటి బుసకొడుతున్నాయి. బద్ధకంగా నోట్లో బీడీపెట్టుకుని ఒక రైల్వే పోలీసు పచారు చేస్తున్నాడు. కుక్కొకటి ఎంగిలాకు ఎత్తుకొచ్చి కూర్చుని "నీక్కావాలా" అన్నట్టు కామేశంవేపుచూసి "నీ కివ్వను" అన్నట్టు పట్టుకొని పారిపోయింది. కృష్ణదేవరాయలు పకోడీలు

తినేశాడు. ఆకు పారేసి మంచినీళ్ళ కెళ్ళిపోయాడు. లేచి యింటికి బైల్దేరాడు కామేశం.

యింటికి బైల్దేరిన కామేశం బుక్‌స్టాలు దగ్గ రాగిపోయేడు. స్టాలువాడులేడు. టీకి కాబోలు పోయేడు. నిలబడి పుస్తకం చదువుతోం దో దొరసాని. ఆమెకు గజం దూరంలో నిలబడ్డాడు కామేశం. ఆమె చేతిలోని పుస్తకంవైపే చూస్తూ. దానిచివర అట్టమీద ఆడబొమ్మని చూస్తే తనభార్య గుర్తొచ్చింది కామేశానికి. ఎక్కడుం దో పాపం! నాయుడు తంతున్నాదో ఏవిటో? పైకి మంచివాళ్ళాగే వుండేవాడు నాయుడు. అలాంటివాళ్ళే ఖూనీలు చేసేస్తారు.

దొరసాని చదువుతున్న పుస్తకాన్ని. "వాంటిట్ (want it)" అని కామేశం చేతిలోపెట్టి నవ్వుతూ వెళ్ళిపోవడం. తనవేపు చూడకుండా స్టాలువాడు "ఒకటీ డెబ్బైఐదు" అంటూ వెళ్ళి స్టూలుమీద కూర్చోవడం ఒక్కసారి జరిగేయి. స్టాలువాడు "ఒకటీ అరవై"కి తక్కువ ఎంత అన్నా ఏవరికో టైము చెప్తున్నా డనుకొనేవాడు కామేశం. కాని "ఒకటి డెబ్బైఐదు" అన్న వాడిమాట తనచేతిలోవున్న పుస్తకం ఖరీదే అని గ్రహించిన కామేశం. 'పుస్తకం అక్కర్లేదు' అన్లేక డబ్బిచ్చి బైటపడ్డాడు.

మర్నాడు బాగా పొద్దెక్కాక లేచేడు కామేశం. ఆవేళ్ళకూడా శలవే. ఆఫీసరు ఆగ్రహంవల్ల; పైగా యిల్లు కదలడానికూడా వీల్లేదు. జ్వరమని శలవు పెట్టడం వల్ల. ఏం చెయ్యడానికీ తోచక తాను కొన్న పుస్తకం తీశాడు. "హౌ టు గ్రో గ్రేట్ యిన్ థర్టీ డేస్. (How to grow great in thirty days) అన్న పుస్తకం అది. గొప్పవాళ్ళు యింకా గొప్పవాళ్ళవడానికీ, గొప్ప లేనివాళ్ళకూడా రమారమీ అంత గొప్పవాళ్ళవడానికీ మంత్రాలు మినహా అన్ని చిట్కాలూ వున్నాయి. చివర అట్టమీద చాలా రాసివుంది ఆ పుస్తకంగురించి. ఆ రచయిత గొప్పవాళ్ళను చేయడానికి స్కూలు నడుపుతున్నాట్ట

కామేశం ఆవేళ ఆపుస్తకం చదివెయ్యదలుచుకున్నాడు. చదివేశాడు. అతని కా పుస్తకం నచ్చింది; బాగా నచ్చింది. తనలో వున్న ఏ ఒక్క గుణం వుండవట గొప్పవాళ్ళకి. దాని ప్రకారం గొప్పవాళ్ళవడానికి ముందు సిగ్గు మానుకోవాలిట. ఎంత కొత్తవాడితోనైనా చొరవగా మాట్లాడెయ్యాలిట. పాతవాళ్ళతో మాట్లాడేముందుకూడా నవ్వాలిట. నవ్విన తర్వాత అవతలవాణ్ణి గొప్పవాడవదల్చుకున్నవాడు పొగడాలిట. పొగడ్త ఎక్కడ మొదలుపెట్టడమా అని సందేహం వున్నవాళ్ళకి కొన్ని టిప్సు వున్నాయి. అవతల మనిషి మొగాడైతే అతని తెలివినీ, గొప్పనీ; ఆడదైతే ఆమె అందాన్నీ పొగడాలిట. అవతల మనిషితో ఆ మనిషి పిల్లకూడా వుంటే, ఆ పిల్ల ఏమాత్రం బావున్నా ఆ పిల్ల అందాన్నీ, ఏవీ బాగోకపోతే ఆ పిల్ల తెలివినీ స్తుతించాలిట. పైవాళ్ళు ఎంత సాధారణమైన పని చేసినా మెచ్చుకోవాలిట. యితరులకి, ఎంత చిన్నవైనా ఫర్వాలేదు. ఉపకారాలు చేస్తూనే వుండాలిట.

ఇప్పుడర్థమైంది జార్జి పాపులారిటీకి కారణం కామేశానికి. అతను అందర్నీ పలకరిస్తాడు, ఆఫీసుకి వస్తున్నప్పుడు. వీరయ్య నిద్రపోతూవుంటే లేపి మరీ పలకరిస్తాడు. అసలతను ప్రత్యేకం నవ్వక్కర్లేదు. అతని మొహమే నవ్వు మొహం. అందర్నీ పొగుడుతూనే వుంటాడు. "మీరు తల్చుకుంటే ఎంతసార్" అంటూ.

మర్నాడు నిద్రలేచింది కామేశంకాదు, కామేశ్వర్రావు. లేస్తూనే తన ఎత్తు అంతా సాగేలా బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని అద్దంలో చూసుకున్నాడు. అద్దంలో కనిపించింది ఒక అపరిచిత వ్యక్తి. అతని కళ్ళల్లోని ఎర్రజీర అలసటను కాకుండా, తనకి తనలో వుండే నమ్మకాన్ని సూచిస్తోంది. అతని కనుబొమ్మలూ, నుదురూ ముడుచుకుపోలేదు. భగవంతుడు పెట్టినచోటే వున్నాయి. కామేశం మామూలుగా పెట్టే ముఖ్ఖా. ముడుతలూ లేవు వాట్లో. ఈ మార్పులు మంచి ప్రోత్సాహ మిచ్చేయి కామేశానికి.

పెరట్లో మొహం కడుక్కుని కాఫీకి వంటింట్లో కెళ్ళినప్పుడు "మళ్ళీ ఎన్నాళ్ళకి చూస్తేనా కావుడూ నీ మొహంలో కళ, ఆ ముండ పోయాక" అంది తల్లి, మధ్యాహ్నం భోంచేస్తూ "యీ వేళ వంట దివ్యంగా వుందమ్మా" అన్నాడు కామేశం నవ్వుతూ. "మా నాయనే! మజ్జిగ పులుసు మరో గరిటెడు వెయ్యనా" అంటూ వేశేసింది వాళ్ళమ్మ, జవాబుకోసం ఎదురుచూడకుండా, "గ్రేట్ సక్సెస్" అనుకున్నాడు కామేశ్వర్రావు.

వేగం భోంచేసి ముస్తాబై విశ్వనాధం ఇంటి కెళ్ళేడు కామేశం. "సరే, ఏమైతే అదే అవుతుంది. ఆఫీసుకి రా," అన్నాడు విశ్వనాధం వేదాంతిలా. ఇద్దరూ కలిసి ఆఫీసు కెళ్ళారు.

ఆఫీసులో మాత్రం వాతావరణం ఏమంత ప్రోత్సాహకరంగా లేదు. ముందునాడు సాయంత్రం ఆఫీసరు పైఅధికారి వూరెళ్ళి అతన్తో జరిగిందంతా చెప్పి క్షమార్పణ కోరుకున్నాడు. అతను చెప్పిందంతా సానుభూతితో విన్నాడు పైఅధికారి. కాని మనస్ఫూర్తిగా క్షమించలేకపోయాడు.

కాబట్టి ఆఫీసరు పొరలోవున్న పాములా కదలకుండా గదిలోంచే బుసకొడుతున్నాడు. కామేశంకూడా ఉత్సాహాన్నీ, ఆశనీ పట్టుకొని ఉయ్యాలలూగుతూనేవున్నాడు. జార్జి కూడా అతనికి సలహా ఇచ్చాడు. "ఇంక మళ్ళీ యిలాంటి పొరపాటొస్తే క్షమించొద్దు. యీ సారికి మాత్రం మరిచిపో" అని ఆఫీసర్‌తో చెప్ప మని.

మధ్యాహ్నం మూడు గంటలకి కామేశం ఆఫీసర్ దగ్గరికి సంతకాల కెళ్లాలి. మూడవుతున్న కొద్దీ విచిత్రంగా కామేశానికి తనలో తనకే నమ్మక మెక్కువవడం ప్రారంభిం



చింది. తను పుస్తకంలో చదివిన ఉదాహరణలు. అందులో గొప్పవాళ్ళంతా కష్ట సమయాల్లో ఎలా ధైర్యం చిక్కబట్టుకునేవారో జ్ఞాపకం తెచ్చుకునేసరికి 'యీ గండమెంత, క్షణంలో దాటేస్తాను' అని చెప్పుకున్నాడు కామేశం తనతో. మూడు కొడుతుండగా రుమాలుతో గట్టిగా మొహం తుడుచుకొని, జుత్తు చేత్తోనే సర్దుకుని, కాయితాలతోసహా ఆఫీసర్ గదిలో కెళ్ళేడు కామేశం, పుస్తకంలో చెప్పిన నవ్వు మొహంమీద అచ్చుకొట్టుకొని.

తలొంచుకొని పని చేస్తున్న ఆఫీసరు తలెత్తేసరికి కామేశం కన్పించగానే తల కొట్టేసినట్టనిపించింది, తన అవమానం గుర్తుకొచ్చి. వెంటనే కామేశం తల తీసేద్దామనిపించింది. ఇదివరకు కామేశమెన్ని పొరపాట్లు చేసినా కేవలం చీవాట్లు పెట్టి వ్యవహారం కాగితంమీదికి రాకుండా సర్దుకుపోయేవాడతను, కామేశం చేసిన అఘాయిత్యానికి. తన కన్ఫర్మేషన్ రెండేళ్ళు వాయిదా పడే సూచన ఉన్నా అతను సర్దుకుపోవడానికే ప్రయత్నిస్తున్నాడు. కాని... కాని అతనికి కామేశం నవ్వు భరించ శక్యం కాకపోయింది. పిచ్చివాణ్ణి చేసింది. దారి తప్పిన పిల్లాడు యిల్లు చేరేక "నేనొచ్చేశానమ్మా" అన్నట్టుంది ఆ నవ్వు. పొదరింట్లో దాంగున్న నాయకుణ్ణి చూసి "యిక్కడున్నావా దొంగా?'' అని ప్రబంధ నాయికి పల్కినట్టుంది ఆ నవ్వు.

తనకి అనుకోని రీతిగా కామేశమ్మూలాన ఆపద వచ్చేక ఆఫీసరు "యీ ప్రపంచలో ఏదయినా సాధ్యమే! ముఖ్యంగా చెడ్డ" అనుకొని, అన్ని ఆపదలు ఎదుర్కోడానికి సిద్ధమయ్యాడు. కామేశంలో పిల్లాడి నవ్వు, ప్రబంధ నాయకి నవ్వుకి తప్ప. తనని ఎకసెక్కెం చేస్తున్నట్టుందా నవ్వు.

"ఏమిటా వెర్రి నవ్వు? వెర్రి వాలకమూను?" పెడబొబ్బ లెట్టేడు ఆఫీసరు.


[illegible] కామేశానికి అకస్మాత్తుగా ఆఫీసరు ఎందుకు నురగలు కక్కుతున్నాడో తెలీలేదు. ప్రయత్నించేలోగానే అక్కడే వున్న విశ్వనాథం కామేశం చేతిలోంచి ఫైలు లాక్కుని అతన్ని పైకి తోసేయడం. అతను వెళ్ళి తన సీటులో కూర్చోవడం. "ఏమైందేమైంది" అంటూ మిగతా గుమాస్తాలంతా అతని చుట్టూ చేరడం. "తెలీదు" అతను జవాబు చెప్పేయడం జరిగిపోయేయి. "నువ్వేం భయపడకు బ్రదర్" అని సానుభూతితో ధైర్యం చెప్పేడు జార్జి.

నిజానికి కామేశం భయపళ్ళేదు ఉత్సాహం జారవిడవలేదు. ఏం జరిగిందా అని తెలుసుకునేందుకు ప్రయత్నం మాత్రం చేస్తున్నాడు.

"ఎన్నిసార్లు చెప్పినా నువ్వెందు కతనికి ఛార్జెస్ యివ్వవ్!" అని ఆఫీసరు విశ్వనాథాన్ని గదమాయిస్తున్నాడు గదిలో.

"ఏదో తమ యింట్లో శుభకార్యమయ్యేలోగా ఈ పనెందుకని ఆలోచిస్తున్నానంతే. యింకేంకాదు. ఎల్లుండి ఛార్జెస్ సిద్ధం చేసేస్తాను." అని నచ్చజెప్పాడు విశ్వనాథం.

ఆఫీసరుకి ముందు ఒక్క కొడుకు పుట్టేడు. తర్వాత కూమార్తైనా పుట్టలేదు చాలాళ్ళు.




ఇంత పుట్టరనుకొన్న టైముకి పుట్టేరు పిల్లా పిచ్చికాను. ఆవేళ పిచ్చికది మొదటి పుట్టినరోజు. అదే విశ్వనాథం చెప్పిన శుభ కార్యం. ఆఫీసరుగారి దృష్టిలో అది పెళ్ళంత శుభకార్యం; అతని భార్య దృష్టిలో యింకా పెద్దకార్యం ఏదేనా వుంటే అదే.

అంచేత వాళ్ళిద్దరూ పెద్దపెట్టున ఏర్పాటు చేశారు. వూళ్ళో వున్న ఫ్రెండ్సందరికీ సాయంత్రం టీతో సహా అన్నీ అయ్యేయి. కేవలం తన స్టాఫ్‌కి మాత్రం విందు ఏర్పాటుచేశారా రాత్రి.

విందుకి అంతమందీ వచ్చేరు కావేశంతో సహా. ముస్తాబై దూరాన చీకటో ట్యూబ్‌లైట్లా మెరిసిపోతోంది జానకి. ఆమె చుట్టూ దూరాన చీకటిలా వున్నాడు జార్జి.

శలవుమీదున్న యముడిలా ఆఫీసరు యింటిదగ్గ రున్నప్పుడు మంచివాడే. తన స్టాఫందరితోనూ తన తాహతును మరచి హుషారు చేస్తూ, విందంతసేపూ వాళ్ళని యింకా తినమని హెచ్చరిస్తూనే వున్నాడు. కావేశానికి మాత్రం తిట్టకపోవడమే ఆయన చూపిన ఆదరణ.

విందు పూర్తయేసరికి రాత్రి పదిన్నరైంది. పొద్దుటినుండీ నలిగి సతమత మౌతున్న ఆఫీసర్‌కీ, ఆయన భార్యకీకూడా ఎంతట పక్క చేరుదామా అని వుంది. అంతా లేచారు. శలవు తీసుకోవడమే తరవాయి. నిద్రపోతున్న పిల్లణ్ణి లేపి తీసుకు వచ్చి మరీ చూపించింది వాళ్ళందరికీ, ఆఫీసరు భార్య. ఆమెకు కావేశం అంటే ప్రత్యేకాభిమానం. అతను అమాయకుడని. అదికాక అతని తల్లి వాళ్ళయింట్లో సమయా సమయాల్లో వంట చేసి వాళ్ళకి సహాయం చేసేది.

"ఏం కావేశంగారూ! ఎలా వున్నాడు మావాడు?" అంది, వాళ్ళవాడ్ని కావేశం మొహం దగ్గరగాపెట్టి. వాళ్ళవాడు ఆవలించేడు. యింత సేపటికి అతన్ని మాట్లాడమన్న ఆహ్వానం వచ్చింది.

"దివ్యంగా వున్నాడు దీపంలా. అందగాడు మీలాగే- (ఆఫీసరు కనుబొమ్మలు మీదికి వెళ్తున్నాయి). చురుక్కుమా ఆఫీసరుగారే ఐనా అందానికి మిమ్మల్నే పోలాడు. నిజం చెప్పాలంటే మీరు చాలా అందంగా వుంటారు- (పళ్ల పటపటలాడుతున్నాయి). మీరు చాలా చిన్నపిల్లలా వుంటారు- (పిడికిళ్ళు బిగుస్తున్నాయి). నిజానికి మీరు ఆఫీసరుగారి భార్యని ఎవరూ అనుకోరు. మీరు......

విశ్వనాథం కావేశం కాలిమీద తన్ని అతని నోరు మూశాడు.

కావేశం చెప్పింది అక్షరాలా నిజం. పొగడ్తంలేదు. ఆఫీసరుగారికి రెండో వివాహం. అతని భార్య అందగత్తే, చిన్నదీ కూడా. నిజం చెప్తే ఎందుకు విశ్వనాథం తన కాలు నలిపేశాడో తేలీక కావేశం అందర్నీ కలియచూశాడు. ఆఫీసరుగారి భార్య కొంపలంటుకున్నట్టు పిల్లణ్నెత్తుకొని పారిపోతూంది. అంతా ఎప్పుడు పేల్తుందో తెలీని ఏటంబాంబుని పట్టుకున్నట్టున్నారు. ఆఫీసరు పేలబోయే ఏటంబాంబులా పొగ కక్కు పేలాడు "టేక్ హిమ్ ఎవే బిఫోర్ ఐ కిల్ హిమ్ (Take him away before I kill him).

హత్య జరిగినట్లున్న వాతావరణంలో ఎవరూ శలవు తీసుకోకుండానే కావేశాన్ని యీడ్చుకుపోయారు. గేటు దాటగానే "రేపు ఆఫీసు కిన్ని నువ్వులు పట్రా, ఉద్యోగానికి నీళ్లొదిలేద్దువుగాని'' అని విశ్వనాథమే నిశ్శబ్దాన్ని పోగొట్టాడు.

రెండోసారి పేలబోయే బాంబులా ఘూర్ణిల్లుతున్న ఆఫీసరు వరండాలోంచే కేకవేశాడు. ప్రతి అక్షరం వత్తి పలుకుతూ. వి శ్వ నా థం' అని. విశ్వనాథం వెనక్కు పరిగెత్తేడు, సార్ అంటూ.

మిగతావాళ్ళంతా ఎక్కువదూరం కలిసి నడవలేదు. వీధి చివర చేరగానే మార్గాలు



విడిపోయాయి. కావేశానిదొక్కడిదీ ఒక తోవ. మిగిలిన వారందరిదీ ఒక తోవ.

కావేశం ఒక్కడూ నడుస్తున్నాడు. వీధి లైట్లు నీరసంగా కాలుతున్నాయి. మేఘాలు చంద్రుణ్ణి కప్పివేస్తున్నాయి. పొగమంచు తెరలు ఒకటొకటి కావేశాన్ని కప్పివేస్తున్నాయి. అంచులు కరుగుతూ ముందుకు నడుస్తున్న కావేశం మరీ అస్పష్టంగా ఆకారరహితుడై, మాయని పొడుగాటి మచ్చలా సాగిపోతున్నాడు.

కావేశం వెళ్ళిపోయాడు రైలు స్టేషను వైపు. స్టేషన్ చేరాక టిక్కట్టు కొనుక్కొని ఏ వూరయినా పోవచ్చు – లేక టిక్కట్టు కొనకుండా ఏ రైలుక్రిందయినా పడొచ్చు – అదీకాకపోతే వారం రోజుల్లో గొప్పవాడవడానికి మరేదయినా పుస్తకం కొనుక్కొని రావచ్చు. అవి కేవలం అతనికి సంబంధించిన విషయాలు.

చిన్న కథకి తొలిమాట ఉండవు. అంచేత చివర నోమాట. తెలివైనవారూ, చురుకైనవారూ సంఘంలో తమ స్థానాల్ని తామే నిర్ణయించుకో గలరు. కావేశం లాంటి అదృష్టహీనుల్ని ఆదరించగలిగినదే ఉత్తమ సంఘం.